## క్లుప్తంగా

### ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలపై పోస్టర్ ఆవిష్కరణ



**ఈపూరు:** ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (దూరవిద్యావిధానం) ఆధ్వర్యంలో 10వ తరగతి ఇంటర్‌మీడియెట్‌లలో 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రవేశాల నిమిత్తం ఈపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దూరవిద్యా విధానం ద్వారా చదువుకోవాలని ఆసక్తి ఉన్న వారు పాఠశాలలో సంప్రదించాలన్నారు. ఈ సంవత్సరం ప్రవేశాలను పెంచనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఎ.ఎం.హుస్సేన్, కోఆర్డినేటర్ సుబ్బారెడ్డి, ప్రధానోపాధ్యాయులు ఎన్.రామకృష్ణారెడ్డి, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రారంభమైన ఆలయ బ్రహ్మోత్సవాలు



**వినుకొండ(నూజెండ్ల):** పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో వేంచేసి ఉన్న అలివేలుమంగా, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో 37వ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. నాలుగు రోజుల పాటు జరిగే ఈ బ్రహ్మోత్సవాల్లో మొదటి రోజు స్వామి వారికి శ్రీవిశ్వక్సేనారాధన, పుణ్యాహం, ఉత్సవ మూర్తులకు స్నాపన, అలంకరణ, అర్చన, నీరాజనం, మంత్రపుష్పం, తీర్థప్రసాదాల వినియోగం వంటి కార్యక్రమాలు జరిగినట్లు అర్చకులు శ్రీనివాస శ్రావణ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సేవ సమితి ట్రస్ట్ అధ్యక్షులు రెడ్డి బంగారయ్య, ప్రధానకార్యదర్శి అచ్యుత కృష్ణ సుబ్బారావు, కోశాధికారి కాళ్ల రామకోటేశ్వరరావు, ట్రస్ట్ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

### ఓట్ల తొలగింపుపై రీసర్వే

**నాదెండ్ల:** రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం నుంచి మూడు రోజుల పాటూ ఓట్ల తొలగింపుపై రీసర్వే ప్రారంభమైంది. మండలంలోని 57 పోలింగ్ బూత్‌ల్లో 57 మంది బీఎల్‌వోలు ఐదుగురు సూపర్‌వైజర్లు గతేడాది జనవరి 6 నుంచి ఈ నెల 15 వరకూ మృతి చెందిన వ్యక్తుల వివరాలు ఎన్నికల సంఘానికి పంపారు. దీనిపై మంగళవారం నాదెండ్ల తహసీల్దార్ ఎన్.నాగమల్లేశ్వరరావు, బీఎల్‌వోలతో కలసి రీసర్వే తనిఖీ చేశారు.

### జాతీయ క్రీడా దినోత్సవం

**నరసరావుపేట ఈస్ట్:** జేఎన్‌టీయూ–ఎన్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల వ్యాయామ సంచాలకుడు డాక్టర్ జీపీ రాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సీహెచ్.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.శోభన్‌బాబు, అధ్యాపకులు పాల్గొని మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాశాల నుంచి రాష్ట్ర, జాతీయస్థాయి ఆటల పోటీలలో పాల్గొని పతకాలు సాధించిన విద్యార్థులను సత్కరించి బహుమతులు అందచేశారు.

### కార్యవర్గ ప్రమాణ స్వీకారం

**చిలకలూరిపేట:** లయన్స్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట, లయన్స్ మహిళా క్లబ్‌ల నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం పట్టణంలోని జంపని భాస్కరరావు సినీ కళ్యాణమండపంలో మంగళవారం నిర్వహించారు. లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా రావికింది మణికుమార్, కార్యదర్శిగా షేక్ ఇమ్రాన్, కోశాధికారిగా శనగల హనుమత్ శాస్త్రి ప్రమాణ స్వీకారం చేశారు. లయన్స్ మహిళా క్లబ్ అధ్యక్షురాలిగా రావికింది లీలాకీర్తన, కార్యదర్శిగా పొన్నూరు నాగవర్ధని, కోశాధికారిగా వినుకొండ విజయలక్ష్మి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ట్రైసైకిల్, కుట్టుమిషన్, ఫ్రిజ్, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు డాక్టర్ కొల్లా అమర్, నూతలపాటి వీర ప్రకాష్, నక్కా కోటేశ్వరమ్మ, పోలిశెట్టి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

### చెట్ల నరికివేతపై ఫిర్యాదు

**నరసరావుపేట:** స్థానిక ప్రకాష్‌నగర్‌లోని అంధుల పాఠశాల ఆవరణలో టీచర్ల నుంచి అద్దెలు వసూలుచేయటంతో పాటు విలువైన చెట్లను నరికించి బయటకు తరలిస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకొని ఆస్తులను కాపాడాలని ఏఈఎల్‌చర్చి సెయింట్ పాల్ లూథరన్ చర్చి వెస్ట్ సెక్రటరీ, సభ్యులు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం అడహక్ కమిటీ సెక్రటరీ బి.చర్చిల్‌బాబు, సభ్యులు బోరుగడ్డ అంబేడ్కర్, నెలటూరి మురళి, కె.ఆనందరావు కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.

### ఓపెన్ స్కూల్లో..

**నరసరావుపేట రూరల్:** ఏపీ ఓపెన్ స్కూల్ ద్వారా 10వ తరగతి, ఇంటర్మీడియట్ పూర్తిచేసుకోవచ్చని ఏపీ ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్లు కె.ఎం.ఏ హుస్సేన్, కె.వి.సుబ్బారెడ్డిలు తెలిపారు. మండలంలోని ఉప్పలపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏపీ ఓపెన్ స్కూల్‌పై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సంక్షేమాన్ని చూసి ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయి

- దుష్ప్రచారాన్ని ప్రజలే తిప్పికొట్టాలి
- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని



మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న మంత్రి విడదల రజిని

**నాదెండ్ల:** వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలును చూసి ప్రతిపక్ష పార్టీలు ఓర్వలేక దుష్ప్రచారం చేస్తున్నాయని, ప్రజలు వాటిని తిప్పికొట్టి వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మరింత మద్దతుగా నిలవాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. గణపవరం గ్రామంలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఐదోరోజు నిర్వహించారు. మెయిన్ రోడ్డులోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు అమలౌతున్న తీరును ప్రజలతో మమేకమై తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కార్యక్రమాన్ని సాగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పాలనలో, సంక్షేమ పథకాల అమలులో చరిత్ర సృష్టించిన నాయకుడు మన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. అన్నివర్గాలకు నామినేటెడ్ పదవుల్లో, ఇతర ప్రభుత్వ పదవుల్లో పెద్దఎత్తున అవకాశాలు కల్పించారన్నారు. దీంతో ఆయా వర్గాలకు పాలనలో భాగస్వామ్యం లభించిందన్నారు. వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజలకు కావల్సిన ప్రతి పథకాన్ని ఇంటి ముంగిటకే అమలు చేస్తున్నామన్నారు. వైఎస్సార్ రైతు భరోసా, అమ్మఒడి, ఆరోగ్యశ్రీ, విద్యాదీవెన, విద్యా వసతి, వైఎస్సార్ ఆసరా, చేయూత, వాహనమిత్ర, లా నేస్తం వంటి ఎన్నో సంక్షేమ పథకాల అమలుతో అన్ని వర్గాల్లో సంతోషాలు అందించారన్నారు. విద్య, వైద్య రంగాల్లో రాష్ట్రంలోనే స్వర్ణయుగం ఆవిష్కృతమైందన్నారు. ఇప్పటికే పలు రాష్ట్ర ప్రభుత్వాలు మన రాష్ట్రంలో అమలౌతు న్న సంక్షేమ పథకాలను గమనిస్తూ, వారి రాష్ట్రాల్లో అమలు చేస్తున్నాయన్నారు. ఇది ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విజయవంతమైన పాలనకు నిదర్శనమన్నారు. సుపరిపాలన, సంక్షేమ పథకాలు నిరంతరం సాగేందుకు ప్రజలు ఆశీస్సులందించాలని కోరారు.

కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫానీ, వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వర రావు, మార్కెట్ యార్డు చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, యడ్లపాడు జెడ్పీటీసీ వాసు, మాజీ సర్పంచ్ కెల్లంపల్లి సుందరరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు కాట్రు రమేష్, నాలుగో వార్డు ఇన్‌చార్జి కాటా వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు పిల్లి సాగర్‌బాబు, షేక్ ఆదంవలి, తులం సుధాకర్, నాయకులు లిఫ్ట్ ఇరిగేషన్ చైర్మన్ బొప్పుడి రామారావు, జెడ్పీ హైస్కూల్ పీఎంసీ చైర్మన్ సూరా శంకరరెడ్డి, గాలి బుచ్చయ్య, కొండెపాటి నాగయ్య, అవ్వారు సుబ్రహ్మణ్యం, గుంజి ప్రసాద్, సొంగా వెంకటేష్, మొలకా గురునాథం, నంబూరు నాగేశ్వరరావు, రెబ్బనబోయిన ఆదినారాయణ, బొంతా బాబు, పట్టంశెట్టి కిరణ్, వెంకన్నరాజు, కాటా రత్తయ్య, సూర్యనారాయణ, పోతురాజు, పంచాయతీ కార్యదర్శి అర్వపల్లి శేఖర్, సాయి, వెంకటేష్, జ్ఞానయ్య పాల్గొన్నారు.

## జగనన్న పాలవెల్లువలో భాగంగా రుణమేళా



ధ్రువపత్రాలను అందజేస్తున్న ఏడీఏ శ్రీనివాసమూర్తి

**ఈపూరు:** మండలంలోని వనికుంట, ఈపూరు గ్రామాల్లో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జగనన్న పాలవెల్లువలో భాగంగా రుణమేళా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పశుసంవర్ధక శాఖ ఏడీఏ శ్రీనివాస మూర్తి మాట్లాడుతూ పాడిరైతుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. జగనన్న పాల వెల్లువ కార్యక్రమంలో భాగంగా డెయిరీకి పాలు పోయడం ద్వారా ఆర్థికంగా లాభపడతారన్నారు. ఆయా గ్రామాల్లో జరిగిన రుణమేళాలలో సుమారు 100 మంది పాడిరైతులు రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన తెలిపారు. వీరికి జీడీసీసీ బ్యాంక్ ద్వారా సెప్టెంబరు నెలలో గ్రౌండింగ్ చేసి అక్టోబరు నెలలో రుణాలు ఇచ్చేందుకు కృషి చేస్తామని ఏడీఏ శ్రీనివాస మూర్తి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు, వీవోఏలు, ఎండీహెచ్‌ఎస్‌లు పాల్గొన్నారు.

## రుణాలు సద్వినియోగం చేసుకోండి




మాట్లాడుతున్న ఎంపీడీవో సీతారామయ్య

**శావల్యాపురం:** జగనన్న పాలవెల్లువ కార్యక్రమంలో అర్హత కలిగిన ఉన్న లబ్ధిదారులు రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య సూచించారు. మంగళవారం మండలంలోని కనమర్లపూడి, శావల్యాపుర గ్రామాల్లో జగనన్న పాల వెల్లువ కార్యక్రమంపై లబ్ధిదారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సదస్సులో ఎంపీడీవో పాల్గొని మాట్లాడుతూ అమూల్ పాలకేంద్రాల్లో పాలు పోసే ఉత్పత్తిదారులకు మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో 1700 మంది లబ్ధిదారులకు రుణాలు ఇవ్వడానికి లక్ష్యంగా ఎంచుకున్నామన్నారు. సొసైటీ బ్యాంకు ద్వారా ప్రభుత్వ పరంగా ఒక్కొక్కో లబ్ధిదారుడికి రూ. ఒక లక్ష 60 వేలు రుణాలను మంజూరు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం పాడి రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ త న్నీరు భారతి, ఎంపీటీసీ సభ్యులు మరియమ్మ, పశువైద్యాధికారులు పాలపర్తి గణేష్ కుమార్, ఏపీయం జి. వాసుబాబు, సీసీలు ఖాజావలీ, గొట్టం రమాదేవి, బేబి రాణి, సభ్యులు పాల్గొన్నారు.

## అక్రమ మద్యం విక్రయాలపై పోలీసుల కన్నెర్ర



బండ్లమోటు స్టేషన్‌లో స్వాధీనం చేసుకున్న అక్రమ మద్యంతోపాటు నిందితులతో పోలీసులు

**బొల్లాపల్లి:** అక్రమ మద్యం విక్రయాలు, జూదం అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని బండ్లమోటు ఎస్సై జి. రవికృష్ణ అన్నారు. మండలంలో సుంకం చెల్లించని మద్యం అక్రమంగా విక్రయిస్తుండగా ముగ్గురిని అదుపులోకి తీసుకొని అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. సమాచారం మేరకు దాడిచేయగా మద్యంతోపాటు ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని కోర్టుకు హాజరుపరచామని తెలిపారు. వెల్లటూరు గ్రామానికి చెందిన అడక ఆంజనేయులు గోవా నుంచి రైలు ద్వారా అక్రమ మద్యాన్ని తరలిస్తూ స్థానికంగా అక్రమంగా విక్రయిస్తుంటాడు. అదేగ్రామానికి చెందిన అద్దలపూడి అశోక్ చక్రవర్తి రామాపురం గ్రామంలో దాబా నిర్వహిస్తుండగా ఆంజనేయులు అక్రమ మద్యాన్ని అశోక్‌కు సరఫరా చేస్తుండగా దాడి చేసి ఇరువురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. పుల్లలచెరువు మండలం మర్లపాలెం గ్రామానికి చెందిన ఆరుబండ్ల వినోద్‌కు గత మూడు నెలలుగా ఆంజనేయులు ద్వారా అక్రమ మద్యం సరఫరా చేస్తూ పట్టుబడ్డాడని, ముగ్గురిని అదుపులోకి తీసుకొని అక్రమమద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరివద్ద నుంచి 40 క్వార్టర్ బాటిళ్లు, ఏడు 750 ఎంఎల్ బాటిళ్లు స్వాధీన పరచుకున్నామని, వీటి విలువ రూ.13,500 ఉంటుందని తెలిపారు. ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే చర్యలు తప్పవని, వీరిపై రౌడీషీట్ సైతం నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు. దాడిలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## దాడికి పాల్పడిన వ్యక్తి అరెస్టు

**నాదెండ్ల:** తన సోదరుడు, మేనమామపై దాడి చేసిన చందవరం గ్రామానికి చెందిన వ్యక్తిని నాదెండ్ల పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై బలరామిరెడ్డి తెలిపిన వివరాల మేరకు చందవరం గ్రామానికి చెందిన గొంటు జయభరత్‌రెడ్డి తన ట్రాక్టర్‌తో ద్విచక్రవాహనంపై వెళ్తున్న తన మేనమామ కృష్ణారెడ్డిని ఢీకొట్టాడు. అదేమని ప్రశ్నించిన గొంటు శ్రీనివాసరెడ్డిపై గొడ్డలితో దాడి చేశాడు. గొంటు శ్రీనివాసరెడ్డి, చేరెడ్డి కృష్ణారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మంగళవారం నిందితుడు జయభరత్‌రెడ్డిని అరెస్టుచేసి కోర్టుకు హాజరుపరిచారు.

## భూముల రీ సర్వే

**బొల్లాపల్లి:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీసర్వే మండలంలోని పేరూరుపాడు, బొల్లాపల్లి, వడ్డెంగుంట, కనుమలచెరువు, గుట్లపల్లి రెవెన్యూ గ్రామాల్లో కొనసాగుతుందని ఇన్‌చార్జి తహసీల్దార్ వి.సుధాకర్‌శర్మ తెలిపారు. త్వరలో రోవర్స్ యంత్ర పరికరాల ద్వారా సర్వే నిర్వహిస్తామన్నారు. ఈ సర్వేలో భూ కొలతలు నిక్కచ్చిగా నిర్వహణ ఉంటుందని తెలిపారు. రీసర్వే పూర్తయిన అనంతరం హద్దురాళ్లు ఏర్పాటు చేయడం, రైతులకు భూములకు సంబంధించి పూర్తిస్థాయిలో సంబంధిత ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామని ఇన్‌చార్జి తహసీల్దార్ తెలిపారు.

## వ్యక్తిపై బీరు సీసాతో దాడి

**నరసరావుపేట టౌన్:** వ్యక్తిపై బీరు సీసాతో దాడికి పాల్పడిన సంఘటన మంగళవారం పట్టణంలో చోటు చేసుకుంది. మిట్ట బజారుకు చెందిన నీలం చక్రపాణి మద్యం సేవించేందుకు అరండల్‌పేటలోని ఆర్‌కే బార్ అండ్ రెస్టారెంట్‌కు వెళ్లాడు. అక్కడ అప్పటికే మద్యం సేవించి ఉన్న నక్కా గోపితో స్వల్ప వివాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో చక్రపాణిపై గోపి బీరు సీసాతో దాడికి పాల్పడ్డాడు. సంఘటనలో తీవ్రంగా గాయపడ్డ క్షతగాత్రుడిని 108 సహాయంతో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్ కుమార్ తెలిపారు.

## కొప్పుకొండ భూములపై విచారణ

**నూజెండ్ల:** వినుకొండ రూరల్ మండలం కొప్పుకొండ గ్రామ పంచాయతీ పరిధిలో 120 ఎకరాల చెరువు పోరంబోకు భూములపై మంగళవారం ఆర్డీవో శేషురెడ్డి, తహసీల్దారు కిరణ్‌కుమార్‌లతో పాటు, సర్వేయర్లు విచారణ చేపట్టారు. సర్వే నంబరు 281/10 బీ, 289లో గల భూములను గత టీడీపీ ప్రభుత్వంలో అక్రమ చేపల చెరువు ఏర్పాటు చేశారు. అయితే ఆ భూములను ప్రభుత్వం గతంలో స్వాధీనం చేసుకుంది. కోర్టు ఉత్తర్వుల మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టి నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు పంపుతున్నట్లు ఆర్డీవో శేషురెడ్డి తెలిపారు.

# నీతిలేని రాజకీయాలు, నిరాధారమైన ఆరోపణలు!

- మళ్లీ అధికారంలోకి రావాలనుకోవడం కల్ల
- జీవీ ఆంజనేయులకు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు హితవు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

**వినుకొండ(నూజెండ్ల):** నియోజకవర్గ ప్రజలను మభ్యపెట్టే విధంగా తనపై నిరాధారమైన ఆరోపణలతో మళ్లీ అధికారంలోకి రావాలని మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ప్రయత్నించడం మానుకోవాలని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు హితవు పలికారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముల్పూరు ఆగ్రోటెక్‌కు సంబంధించిన భూములను తనకు ఆపాదిస్తూ అసత్య ప్రచారం చేయడమే కాకుండా భూ యజమానులను భయభ్రాంతులకు గురి చేస్తున్నానని జీవీ ఆంజనేయులు ప్రయత్నిస్తుండటం సిగ్గుమాలిన చర్యగా అభివర్ణించారు. టీడీపీ హయాంలోనే ముల్పూరు ఆగ్రోటెక్ లక్ష్మయ్య చౌదరి భూములను కొనుగోలు చేస్తే తాను 2015–16 మధ్యలో ఆ భూములను ధరను చెల్లించి కొనుగోలు చేయడం జరిగిందన్నారు. టీడీపీ హయాంలోనే డెయిరీ ఏర్పాటు చేయడమే కాక గోశాల నిర్మాణ పనులు ప్రారంభించడం జరగగా నేడు ప్రభుత్వ భూమిని కాజేసి మట్టిని అమ్ముకుంటున్నానని అఖిలపక్షం పేరుతో నాయకులను పురిగొల్పి జీవీ దుష్ప్రచారం చేస్తున్నారన్నారు.

**టీడీపీ హయాంలోనే భూములు స్వాహా**

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలోని అనేక ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతానికి గురయ్యాయని ఎమ్మెల్యే బొల్లా పేర్కొన్నారు. నేడు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆ భూములపై ప్రభుత్వ అధికారులు సర్వేలు చేపట్టి టీడీపీ నాయకులు ఆక్రమించుకున్న భూములను స్వాధీనపరచుకోవడం జరుగుతుందన్నారు. ఇంటి నిర్మాణాలు చేపట్టే భవన నిర్మాణ యజమానులు తమకు అందుబాటులో ఉన్న ప్రాంతాల నుంచి అవసరమైన మట్టిని స్వేచ్ఛగా తీసుకెళ్లవచ్చని ఎమ్మెల్యే బొల్లా పేర్కొన్నారు. అనుమతుల పేరుతో మట్టిని తీసుకెళ్లేవారిని తాను ఇబ్బంది పెడుతున్నానంటూ జీవీ అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. వినుకొండ రామలింగేశ్వర స్వామి ఆలయ పునఃనిర్మాణ పనుల్లో భాగంగా చందాల పేరుతో ప్రముఖులను తాను బెదిరిస్తున్నానంటూ జీవీ దుష్ప్రచారం చేయడం మానుకోవాలన్నారు. సంగం డెయిరీ అంటే ఉమ్మడి గుంటూరు జిల్లాకు సంబంధించినదని, అటువంటి డెయిరీల ఏర్పాటుకు టీడీపీ హయాంలో ప్రభుత్వ భూమిని కేటాయించిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు.

## గురుకుల పాఠశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు



మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షులు వీరాంజనేయచౌదరి

**వినుకొండ(నూజెండ్ల) :** లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి యు.రామ్మోహన్ ఆదేశాల మేరకు స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని బాలికల గురుకుల పాఠశాలలో మంగళవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో వినుకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షులు చాగంటి వీరాంజనేయులు మాట్లాడుతూ విద్యార్థులకు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. మైనర్ బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, ఫ్రెండ్లీ రిలేషన్స్ వంటి పలు అంశాలపై వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం వంటశాలను, భోజన పదార్థాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రటరీ హనుమంతరావు, వైస్ ప్రెసిడెంట్ మారెళ్ల సీతారామాంజనేయులు, న్యాయవాదులు తలారి ఆంజనేయులు, గంధం హరిప్రసాద్, నీలం శేఖర్ బాబు, నేలపట్ల అశోక్‌బాబు, చెన్నయ్య, శ్రీను నాయక్, దూల నాగరాజు, బి.నాగరాజు, రెడ్డి నాగ పద్మ,, హేమలత, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీఎస్పీ కె.వి. మహేష్

**నరసరావుపేట రూరల్:** క్రీడలపై విద్యార్థులు ఆసక్తి పెంచుకోవాలని డీఎస్పీ కె.వి.మహేష్ తెలిపారు. నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న డీఎస్పీ మహేష్ మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొనడం వలన జ్ఞాపకశక్తి పెరుగుతాయని, దీనివల్ల అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. క్రీడల్లో రాణించడం ద్వారా ఉద్యోగాలు సాధించవచ్చని తెలిపారు. విద్యార్థులు జీవితంలో ఎవరిమీద ఆధార పడకూడదన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు మాట్లాడుతూ సంపూర్ణమైన విద్యార్థి చదువుతో పాటు క్రీడలు, ఇతర రంగాలలో నైపుణ్యాలు కలిగి ఉండాలని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీలలో విజేతలకు డీఎస్పీ మహేష్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్‌చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, కార్యదర్శి మిట్టపల్లి రమేష్‌బాబు, కళాశాల స్పోర్ట్స్ కన్వీనర్ ఎల్.కృష్ణారెడ్డి, ఝాన్సీరాణి, ఐ.శ్రీధర్ పాల్గొన్నారు.

## పనితీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవు



మాట్లాడుతున్న డీసీహెచ్‌ఎస్ బీవీ రంగారావు

**ఈపూరు:** వైద్యులు తమ పనితీరును మార్చుకొని ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా వైద్యసేవలు అందించాలని జిల్లా వైద్య విధానపరిషత్ వైద్యాధికారి బి.వి.రంగారావు అన్నారు. మండల కేంద్రమైన ఈపూరు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యశాలలోని వైద్యులు, వైద్య సిబ్బంది పనితీరు మార్చుకోవాలని లేకుంటే చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అధునాతన రక్త పరీక్షల పరికరాలు వినియోగంలో పెట్టకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యపరీక్షల కోసం ఆసుపత్రికి వచ్చే రోగులకు ల్యాబ్ పరీక్షాఫలితాలు వెంటనే తెలియజేయకపోతే ఆరోగ్య సమస్యలు ఎలా తెలుస్తాయని, పరీక్ష ఫలితాలను రోగులకు వెంటనే అందజేయాలన్నారు. ఎక్స్‌రే యంత్రం మరమ్మతులకు గురైతే బాగు చేయించి వినియోగంలోకి తీసుకురాకుండా వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏమిటని ప్రశ్నించారు. సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహించాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామన్నారు. నెలకు పది కాన్పులు జరగాల్సి ఉండగా ఈ నెలలో 2 మాత్రమే చేయడడంపై ఆయన అహసనం వ్యక్తం చేశారు. వైద్యులు పద్ధతి మార్చుకొని పేద ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

# తెలుగు భాషను కాపాడుకోవాలి

- అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ
- వేర్వేరు ప్రాంతాల్లో ఘనంగా మాతృభాషా దినోత్సవం



చిలకలూరిపేటలో రామ్మూర్తి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న లక్ష్మీనారాయణ



నరసరావుపేటలో సాహితీవేత్తలను సత్కరిస్తున్న దృశ్యం

**చిలకలూరిపేట:** తెలుగుభాషను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ సూచించారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో అరసం, ప్రజానాట్యమండలి సంయుక్త ఆధ్వర్యంలో గిడుగు రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా మాతృభాషా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ముందుగా గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాషను ప్రజల భాషగా మార్చడంలో గిడుగు రామమూర్తి ఎంతో కృషి చేశారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో వ్యవహారిక భాషోద్యమానికి ఆయన మూలపురుషుడని కొనియాడారు. గురజాడ అప్పారావు, కందుకూరి వీరేశలింగం పంతులు, శ్రీశ్రీ తదితరులు ఆయన భావజాలాన్ని వ్యాప్తి చేశారని పేర్కొన్నారు. తెలుగు భాష నిత్యనూతన జీవన భాషగా నిలిచి ఉంటుందని, ఇందుకు సాహితీవేత్తలు, కళాకారులు కృషి చేయాలని సూచించారు. సాహితీ విమర్శకులు డాక్టర్ పీవీ సుబ్బారావు మాట్లాడుతూ ఎందరో అభ్యుదయ కవులు, సాహితీవేత్తలకు గిడుగు రామమూర్తి పంతులు ఆదర్శనీయుడని పేర్కొన్నారు. రాష్ట్ర అధికార భాషా సంఘం సభ్యుడు డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తెలుగు భాషాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నదని వెల్లడించారు. ఈ సందర్భంగా ఇటీవల అరసం జాతీయ అధ్యక్షుడిగా ఎంపికైన పెనుగొండ లక్ష్మీనారాయణను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్, సీపీఐ ఏరియా కార్యదర్శి నాగభైరు రామసుబ్బాయమ్మ, నాయకులు రావిపాటి వెంకటేశ్వరరావు, పేలూరి రామారావు, నాయుడు శివకుమార్, ఆరాధ్యుల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**వ్యాసరచన పోటీలు**

తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని రోటరీ క్లబ్ ఆఫ్ పండరీపురం ఆధ్వర్యంలో పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. తెలుగు భాషను రక్షించుకోవడానికి నేనేం చేస్తానంటే ? అనే అంశంపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ముందుగా గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు అలంగార్ మోహన్, కేఎస్ఆర్ ప్రసాదరాజు, అలాదాసునాయన, బాలల రచయిత దార్ల బుజ్జిబాబు, గ్రంథాలయ ఇన్‌చార్జి అధికారి నాగుల్ మీరావలి పాల్గొన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో పట్టణంలోని బీఆర్‌జీ మున్సిపల్ హైస్కూల్‌లో మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. పలువురు వ్యక్తులు గిడుగు రామమూర్తి జీవిత విశేషాలను వివరించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు తోటకూర వెంకట నారాయణ, కాపు వెంకటరావు, ఆళ్ల వేమనరెడ్డి, తాళ్ల అంజిరెడ్డి, తొట్టెంపూడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

**నరసరావుపేటలో...**

**నరసరావుపేట ఈస్ట్:** వ్యవహారిక భాషోద్యమకారుడు గిడుగు రామ్మూర్తి 160వ జయంతిని పురస్కరించుకుని పట్టణంలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పల్నాడు రోడ్డులోని శాఖా గ్రంథాలయంలో శ్రీనాథ సాహితీ పరిషత్ ఆధ్వర్యంలో తెలుగు సాహితీ వేత్తలను ఘనంగా సత్కరించారు. తెలుగు సాహిత్యాభివృద్ధికి సేవలు అందిస్తున్న బాణావత్ మాన్‌సింగ్ నాయక్ (బాల సాహిత్యం, కారంపూడి), సుందర్ (కథా సాహిత్యం, నరసరావుపేట) మహేష్ (వేమన సాహిత్యం), అచ్చుల సుబ్బారావు (నవల, కథా రచన)ను సత్కరించారు. కార్యక్రమంలో పరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి, రిటైర్డ్ ఆంధ్రోపన్యాసకులు డాక్టర్ చేరెడ్డి మస్తాన్ రెడ్డి, డాక్టర్ కె.వి.కోటయ్య, కవి ఈపూరి వెంకట రెడ్డి, రిటైర్డ్ హెచ్‌ఎం పి.వి.ఎస్.ఆర్.ప్రసాదరావు పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించి ప్రభుత్వ ఉత్తమ పాఠ్య పుస్తక రచయిత కుందా భాస్కరరావును సత్కరించారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ–ఎన్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సి.హెచ్.శ్రీనివాసరావు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.హనుమంతయ్య, తెలుగు విభాగాధిపతి డాక్టర్ కాకాని సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

**నాగిరెడ్డిపల్లెలో...**

**వినుకొండటౌన్:** మండలంలోని నాగిరెడ్డిపల్లిలో గల నిర్మలా హైస్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడాదినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ కమిషనర్ వెంకయ్య, పాస్టర్ పి.ఫిలిప్, కరస్పాండెంట్ సిస్టర్ క్యాస్పర్, ప్రిన్సిపాల్ సిస్టర్ రాణిగోవిండ్, పాల్గొన్నారు.

**నాదెండ్లలో...**

**నాదెండ్ల:** తేనెలొలుకు తెలుగు భాష ఎంతో మధురమైనదని, ప్రతి ఒక్కరూ వాడుక భాషలో స్వచ్ఛమైన తెలుగు మాట్లాడేందుకు కృషి చేద్దామని హెచ్‌ఎం ఐ కృష్ణానాయక్ చెప్పారు. తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు.